జీవితసాయం.

– V Siva Sai.

నా జీవితంలో భగవంతుడు ప్రసాదించిన అతి ముఖ్యమయిన వరాలలో 'వృషామణి ఫౌండేషన్' లో సీటు లభింపచేయటం ఒకటి. అందుకు నేనెంతో గర్విస్తున్నాను ఎందుకంటే రాష్ట్రంలో ఎంతో మంది విద్యార్థులను వరించని సదావకాశం నాకు లభించినందుకు. గుంటూరు జిల్లా లోని వినుకొండ మా స్వస్థలం. మా నాన్న గారి కులవృత్తియే మా జీవనాధారము. నేను పదవ తరగతి వరకు ఎ.పి.ఆర్ స్కూల్, గణపవరం నందు విద్యను అభ్యసించితిని.

నేను పదవతరగతిలో ఉండగా ఒక రోజు మా ప్రిన్సిపాల్ సార్ నన్ను మరియు నాతోపాటు మరో పదిమందిని ఆఫీస్ రూంలోకి పిలిపించి, వృషామణి ఫౌండేషన్ (ది లీడర్షిప్ స్కూల్) గురించి వివరించారు. అప్పుడే నేను ఎలాగయినా ఈ స్కూలులో ఒక విద్యార్థిగా ఉండాలని దృఢంగా నిశ్చయించుకొన్నాను. పదవతరగతి పరీక్షలు అయిపోయిన కొన్నిరోజుల తర్వాత మా ప్రిన్సిపాల్ సార్ నాకు ఫౌండేషన్ నుంచి కాల్ లెటరు వచ్చిందని చెప్పారు. ఆ తరవాత నేను మా నాన్నగారితో కలిసి హైదరాబాదులో మొదటిసారిగా అడుగుపెట్టాను. సంజీవరెడ్డి నగర్ లోని స్వామివిజన్ కాలేజిలో మాకు వ్రాత పరీక్ష మరియు ఇంటర్వ్యూలు జరిగాయి. సాయంత్రం తిరిగివెళ్లేటప్పుడు ఫౌండేషన్ వారు ప్రతి విద్యార్థికి దారి ఖర్చుల నిమిత్తం 500/-లు చెల్లించారు. సెలక్ట్ అవుతానన్న ధీమాతో నేను ఇంటికి వెళ్లాను.

15-05-2008 నాడు మా పదవతరగతి ఫలితాలు విడుదల అయ్యాయి. 17-05-2008 నాడు ఫౌండేషన్ వారు నాకు ఫోన్ చేసి నేను సెలక్ట్ అయ్యానని చెప్పారు. అప్పుడు నా ఆనందానికి అవధుల్లేవు. 19-05-2008 న నేను ఫౌండేషన్‌లో ఒక విద్యార్థిగా రిజిస్టర్ అయ్యాను. నాలాంటి వారే మరో పద్నాలుగు మందిని ఎంపిక చేసారు.

మేమంతా తెలుగు మీడియం వాళ్ళం కావటం వలన భవిష్యత్తులో ఇంటర్మీడియట్‌లో ఇబ్బందులు వస్తాయని గ్రహించి, ఫౌండేషన్ వారు ముందుచూపుతో ఒక ఇంగ్లీషు టీచరును నియమించి మాకు ఒక నెల రోజులపాటు ఇంగ్లీషులో శిక్షణ ఇప్పించారు. నాకు బాగా నచ్చిన విషయం ఏమిటంటే ఫౌండేషన్‌లో చదువొక్కటే ముఖ్యం కాదు, వాటితో లీడర్‌షిప్ క్వాలిటీలను వృద్ధి చెందించడమే వారి ప్రధాన ధ్యేయం. కాలేజికి వెళ్ళేముందు జగన్మోహనరావు సార్ గారు వచ్చి టెక్స్ట్ బుక్స్, నోట్సులు మరియు పెన్నులు పంపిణీ చేసారు. ఫౌండేషన్‌లో ఉన్నంతకాలం మా బాగోగులు చూసుకోవటానికి ఒక గార్డియన్‌ను నియమించారు. మాకు స్కూల్లో లభించని స్వేచ్ఛ, ప్రోత్సాహాలను కల్పిస్తూ విద్యను అందిస్తున్నా వారు ప్రచారం చేసుకోనక పోవడం ఆశ్చర్యకరం. అంతేకాక మా నుంచి చిల్లిగవ్వ కూడా ఆశించలేదు. వారు ఆశించేదల్లా ఒకటే, మేము భవిష్యత్తులో మంచి పౌరులుగా తయారయి, నలుగురికీ సహాయపడుతూ ఆదర్శంగా నిలవడమే.

ఫౌండేషన్‌లో అందరూ వివిధ జిల్లాల నుంచి వచ్చిన వారు కావటంచేత, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని సంస్కృతులు ఇక్కడ కనిపిస్తాయి. ఎప్పటికప్పుడు మా మార్కులను అనలైజ్ చేస్తూ, మాలో కాంపిటేటివ్ స్పిరిట్ పెంపొందించేవారు. దాని మాకు ఫస్ట్ ఇయర్‌లో మార్కులు తక్కువవచ్చినప్పుడు మాకన్నా సార్ బాగా బాధపడ్డారు. ఆ తర్వాత అందరం సమిష్టికృషితో మంచిమార్కులు సాధించాం. నాకు 97% వచ్చింది.

నాకు పదవతరగతి వరకు స్టేజిఫియర్ ఉండేది మరియు ఇంగ్లీషులో అంత ఫ్లూయెన్సీ ఉండేదికాదు. నేను ఇక్కడకు వచ్చిన తరువాత పొందిన మొదటి రెండు లాభాలు ఇవే. సమాజం గురించి చక్కని అవగాహన కలిగింది. అప్పుడప్పుడు కొంతమంది గొప్పవారిని ఆహ్వానించి మాకు మంచిమాటలు చెప్పించేవారు. వారిలో జగన్నాథ-రావు సార్‌గారు మాకు పరిశుభ్రత గురించి ప్రతివారంలో ఒకరోజు ఉదయాన్నే వచ్చి వివరించేవారు. వీటన్నింటితోపాటు నాకు క్రమశిక్షణ అలవడినది. ఫౌండేషన్ వారు మమ్మల్ని రామకృష్ణమిషన్ వంటి సంస్థలకు కూడా పంపించేవారు.

సెకండియర్‌కి వచ్చినతరువాత మేము చాలా చాలా ప్రదేశాలు తిరిగాం. అంతేకాక ఒకసారి హైదరాబాదులోని మారుమూల ప్రాంతాలలోకి వెళ్ళి చదువుకోని పిల్లల వివరాలు సేకరించి ఒక ఆర్గనైజేషన్‌కు అందజేశాము. నేను ఆరోజు సుమారు 70 మంది పిల్లల వివరాలను సేకరించగలిగాను. ఆ రోజు నాకు కలిగిన సంతృప్తి మాటల్లో వర్ణించలేనిది. సమాజంలోని అనేకమందిని దగ్గరగా గమనించి, వారి పరిస్థితులను గురించి తెలుసుకోగలిగాను.

మేము ప్రతిరోజు ఉదయం జాగింగ్‌కి వెళ్ళేవాళ్ళం, కొన్ని సార్లు యోగా చేసేవాళ్ళం. ప్రతి శనివారం సాయంత్రం ఒక అంశాన్ని తీసుకొని దానిపై చర్చించిన తరువాత, ప్రశ్నలు అడిగి తెలియని ఎన్నో విషయాలను తెలుసుకొన్నాను. దీనికి చక్రధర్ సార్ గారు మమ్మల్ని ఐదు గ్రూపులుగా విభజించారు. మా తరువాత మా తరువాతి బ్యాచ్‌ని కూడా సెలక్ట్ చేసి వారికి 'మాతో పాటే వసతి కల్పించ-డంతో, వాళ్ళు కూడా ఈ అలవాట్లను తొందరగా నేర్చుకొన్నారు. నేను వారి ఇంటర్వ్యూలప్పుడు నా వరకు కృషి చేశాను.

సెకండియర్‌లో నేను నేర్చుకొన్న మరో మంచి అలవాటు ప్రతిరోజూ డైరీ రాయటం, దీన్ని చక్రధర్ సార్ గారు మమ్మల్ని పాటించమని సలహా ఇచ్చారు. పరీక్షల ముందు మాకు కొన్ని ఇన్స్పిరేషన్ క్లాసులు కూడా చెప్పించారు. వారిలా కొంతమంది IIT ians కావటం మాకు మార్గదర్శకంగా నిలిచేవారు. నేను జీవితంలో మరచిపోలేని మరో సంఘటన ఏమిటంటే 2009 చివరన వరదలు వచ్చినప్పుడు, మేమంతా [illegible] క్రుప్తు భవన్‌కు వెళ్ళి వరద బాధితుల కొరకు బట్టలు ప్యాక్ చేశాం. అది కూడా ఆ నాకు చాలా ఆత్మసంతృప్తిని కలిగించినది. మా సేవకు గాను 'వృషాయతే ఫౌండేషన్'కు సేవా అవార్డు లభించింది. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ESL నరసింహన్ నుంచి జగన్మోహనరావు సార్ గారు అవార్డు అందుకుంటున్నప్పటి చిత్రం ఇప్పటికీ నా కళ్ళ ముందు కదలాడుతూనే ఉంది.

నేను కాలేజీనుంచి వచ్చేటప్పుడు ఎవరికయినా సహాయం చేసి-నప్పుడు ఎంతో సంతృప్తి చెందేవాడిని, కానీ ఇదంతా ఫౌండేషన్ వారిని చూసి అలవరచుకొన్నదే. ఉదయాన్నే ఫ్రెష్ ఎయిర్‌ను పీల్చడం వల్ల కలిగే లాభాలను ఒకసారి జగన్మోహనరావు సార్ నాకు వివరించారు. దానితో ప్రతిరోజు నేను ఉదయాన్నే అందరికంటే నేనే ముందు ఆ గాలిని ఆస్వాదించాలని కుతూహలంతో జాగింగ్‌కు వెంటనే బయలుదేరటం మొదలు పెట్టాను. దీనితో నాలో ఏ మూలో దాగిఉన్న బద్ధకం కూడా ఎగిరిపోయింది.

నాకు సెకండియర్‌లో రిజల్ట్స్ వచ్చినప్పుడు, సార్ కంగ్రాట్స్ చెప్పినప్పుడు నాకు ఆయన ఎగ్జామ్స్‌కి వెళ్ళేముందు చెప్పిన మాటలు గుర్తుకువచ్చి చాలా ఆనందం వేసింది. ఎందుకంటే నా పనిని నేను సక్రమంగా నిర్వర్తించాను. నాకు ఇన్స్పిరేషన్ ఎవరని అడిగితే. చక్రధర్ సార్‌గారిని నిర్మొహమాటంగా చెప్తాను. నేను కూడా ఆయన లాగే సమాజ సేవ చేయాలనుకొంటున్నాను. అందుకే నేను ప్రశాంతి ఫౌండేషన్‌లో కంట్రిబ్యూట్ చేస్తూ ఒక అనాథ శరణాలయం ఏర్పాటు చేయాలని దృఢంగా నిశ్చయించుకున్నాను.

ఫౌండేషన్ వ్యవస్థాపకులయిన చక్రధర్ సార్‌గారికి, మమ్మల్ని కన్నబిడ్డల వలె చూసుకొంటున్న జగన్మోహనరావు సార్‌గారికి, విజయలక్ష్మి మేడం గారికి మరియు ఫౌండేషన్ మెంబర్స్‌కి జన్మజన్మల ఋణపడి ఉంటానని తెలియజేస్తూ......

Siva Sai.